# జీవితం చెప్పని కథలు

కాటూరు రవీంద్రత్రివిక్రమ్

జీవితం ఒక నిత్య పాఠశాల. అనుభవపాఠాలు కొన్ని. అనుభవజ్ఞుల పాఠాలు మరికొన్ని. 'బతుకు పుస్తకం' చివరి అధ్యాయం వరకు మనం తెలుసుకుంటు, నేర్చుకుంటూనే ఉంటాం. ఉండాలి కూడా. కొన్ని కథల్ని జీవితం చెబుతుంది. కొన్ని కథల్ని చెప్పదు. ఆ చెప్పని కథలు తెలుసుకుంటే - శిథిలం కాని సత్యాలు, మనసు మనోజ్ఞతలు, ఆకుమాటు ఫలాల్లా అగుపించి అలరిస్తాయి. కొన్ని ఆలోచింపజేస్తాయి. కొన్ని కదలిస్తాయి. కొన్ని కరిగిస్తాయి. ఒక్కోకథలో ఒక్కో జీవితసత్యం ఆవిష్కృతమౌతుంది. అలాంటి విశిష్ట కథల్ని 'చినుకు' మాసపత్రికకు ప్రత్యేక కానుకగా, సుప్రసిద్ధ రచయిత శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ అందిస్తున్నారని తెలుపటానికి సంతసిస్తున్నాము.

- ఎడిటర్

కథ

# గ్రీన్‌లైట్

## "బాలూ...."

"ఏంటక్కా?"

"నాకో సాయం చేస్తావా?"

"ఏం చెయ్యాలో చెప్పు.."

"నాకేదన్నా విషం తెచ్చివ్వు.. డబ్బులిస్తాను...." జాకెట్లోంచి వంద రూపాయల కాగితం తీసి చేతికిచ్చింది జమున. చేతిలోని కాయితాన్నీ ఆమెని మార్చి మార్చి చూశాడు.

"ఎందుకు చావాలనుకుంటున్నావ్?" సూటిగా అడిగేడు.

"నేను చావకపోతే రేపు వాళ్లు నన్ను చంపేస్తారు...." కళ్లంబడే బొట బొట నీళ్ళు జారేయి. "వాళ్లు నిన్ను ఎందుకు చంపుతారు?" ఎదురుగా వున్న స్టూలు మీద కూర్చుంటూ అడిగాడు.

"నువ్వింకా పిల్లాడివి. నీకు తెలీదు. చావంటే శరీరానికే కాదు. మనసుక్కూడా. వాళ్లిచ్చిన మూడు రోజుల గడువు ఇవాల్టితో అయిపోతుంది. రేపు నన్ను ఏ పశువుకో అప్పజెబుతారు...." ఆమె ఆ దృశ్యాన్ని ఊహించుకుంటోంది.

"అసలు నువ్వు వీళ్లకెలా చిక్కావు?"

"ఆ రాంబాబు సినిమాలో వేషం ఇప్పిస్తానని మోసంతో తీసుకొచ్చి వీళ్ల కప్పగించాడు...."

"వాడంతే. పైకి రాముడు. లోపల రావణుడు అన్నట్టు వాడు నిన్నేం పాడు చెయ్యలేదుగా?"

"చెయ్యాలని చూశాడు. నేనే లొంగలా..."

"అయినా... చూస్తే చదువుకున్నదానిలా ఉన్నావ్... నీకు సినిమా పిచ్చి ఏంటి? జమున అని పేరుండగానే అందరూ సినీయాక్టర్లయిపోతారా?"

ఆమె అపరాధిలా తలదించుకుంది.

"సినిమా ప్రపంచం అంటే పురుగుల్ని ఆకర్షించే మంటలాంటిది. ఎందరో ఇక్కడ రెక్కలు కాల్చుకున్నారు. ఏడవలేక నవ్వటం... చావలేక బతకటం ఇక్కడ చాలా మామూలు..."

"ఎలా తెలుసు నీకివన్నీ..."

"మా అమ్మా అలాగే ఈ మహానగరానికి కోటి ఆశలతో వచ్చిందట. ఆశల వల్లే మోసపోతాం అని అర్థం చేసుకునేసరికి ఇదుగో ఈ 'రెడ్‌లైట్' కొంపలో చిక్కుకుపోయింది. ఆ తర్వాత నన్ను కని, తను చచ్చిపోయింది. ఈ మురికిలో ఒక పురుగులా పెరిగాను. ఏ మహానుభావుడి బీజమొ నేను. చదువు మీద మహా పిచ్చి నాకు.... కానీ... అవకాశం లేదు. ఊహ తెల్సిందగ్గర్నుంచి ఇక్కడి వాళ్లందరికీ పనులు చేసిపెడుతూ బతుకుతున్నాను...."

"బాధపడకు. నీకూ మంచిరోజులొస్తాయ్"

బాలూ నిర్వేదంగా నవ్వేడు. "మా అమ్మలా నేను ఆశలవలలో చిక్కదలచుకోలేదు. మంచో చెడో... ఆ దేవుడెలా నిర్ణయిస్తే రోజులలా గడుస్తాయి. నా సంగతికేం లే.... రేపు నీ సంగతి నేను చూసుకుంటాను. నువ్వు తొందరపడి ఏ అఘాయిత్యం చేసుకోబోకు"... అని గట్టిగా హెచ్చరించి బయటకెళ్లిపోయాడు బాలూ.

జమున శూన్యంలోకి చూస్తుండిపోయింది. అనుభవాలతో జీవన సత్యాలు తెల్సుకోవటం ఎంత భయంకరమో ఆమెకి తెలిసొచ్చింది.

★ ❋ ★

"సుభానీగారొచ్చారు.."

అంటూ లోపలి కొచ్చాడు బాలూ.

ఆ పిచ్చోడు మళ్లీ వచ్చాడా?" తమలపాకులకి సున్నం రాస్తూ అడిగింది రాణీ అమ్మ. వయసులో ఆమె అందరికి రాణి. వయసు దాటాక రాణీ అమ్మ అయింది. ఆ కంపెనీకి ఆమే మహారాణి. నలుగురు వస్తాదుల్ని, వాళ్ల రక్షణలో పదిమంది 'టాక్సీల్ని' నిర్వహిస్తోంది. (వ్యభిచారాన్ని 'టాక్సీ' లంటారు)

"ఆదాబర్సే రాణీసాయెబా..." అంటూ సలాం చేస్తూ వచ్చిన సుభానీని చూడగానే నవ్వు నటిస్తూ "రండి రండి టికెట్ కలెక్టర్‌గారూ..." అంది రాణీ అమ్మ, తాంబూలం సేవిస్తూ.

"ఇదుగో... మీకు కొత్త సంవత్సరం కానుక" అంటూ కొత్త పదిరూపాయల నోట్లకట్ట చేతిలో పెట్టాడు. దాంతో ఉబ్బితబ్బిబ్బయిపోయింది వేశ్యమాత.

"సాయిబు గారూ! మీక్కూడా నేను కొత్త సంవత్సరం కానుక ఇస్తున్నాను. కొత్త పిట్ట పేరు జమున. తాజా యాపిల్‌లా ఉంది. కానీ, కాస్త జాగ్రత్త... మొదటి కస్టమరు మీరే..." అంది ఒక కన్ను చిన్నది చేసి నవ్వుతూ.

"షుక్రియా షుక్రియా.... తమరు నన్ను టికెట్టు

కలెక్టరు అంటుంటారు.. కానీ నేను రైల్వేగార్డుని. ఎర్రదీపం ఏరియాలోకి వచ్చే పచ్చదీపాన్ని...' అన్నాడు చమత్కారంగా.

"ఏదో ఒకటి. మాకు అవన్నీ ఏం తెలుస్తాయ్. రేయ్ బాలూ... సాయిబు గార్ని జమున దగ్గరికి తీసుకెళ్లు..." అని పురమాయించింది రాణీ అమ్మ.

"ఒక్క నిముషం రాణీ సాయెబా... కొత్త సంవత్సరం... కొత్త చోట అయితే బావుంటుంది.... మాతో హోటలుకి పంపిస్తే సంతోషిస్తాం..." అన్నాడు ఇంకో అయిదొందల కాయితం చేతిలో పెడుతూ. క్షణం మౌనంగా ఉండి, అయిష్టంగానే "సరే... తీసుకెళ్లండి. మళ్లీ జాగ్రత్తగా అప్పజెప్పాలి..." అంది కళ్లు పెద్దవి చేసి, కండిషన్ చెబ్తు..

"అందుకు సందేహం దేనికి రాణీసాయెబా... నేను పాతకస్టమర్నే గానీ కొత్తవాడ్ని కాదుగా?"

"అందుకే వప్పుకుంటున్నాను. రేయ్ బాలూ... జమునతో బాటు నువ్వు కూడా వెళ్లి జాగ్రత్తగా దింపిరా..." అంది రాణీ అమ్మ.

ఆ మాటకోసమే ఆసక్తిగా ఎదురుచూస్తున్న బాలూ ఉషారుగా జమున గదికేసి వెళ్లాడు.

★ ❋ ★

రైలు కూత పెట్టింది. 'గ్రీన్‌సిగ్నల్' కోసం వేసిన కూత అది.

కంగారుగా బాలూకేసి, సుభానీకేసి చూసింది జమున. అది జమున ఊరు వెళ్లే రైలు! గార్డు పెట్టె పక్కనున్న పెట్టెలో ఆమెను కూచోబెట్టాడు సుభానీ. ఆ రోజు తనకి డ్యూటీలేకపోయినా, సహోద్యోగి చేత శలవు పెట్టించి తను డ్యూటీ వేయించుకున్నాడు సుభానీ.

"నాకోసం మీరు చాలా రిస్కు తీసుకున్నారు" కన్నీళ్లతో చేతులు జోడించి నమస్కరించింది జమున. "జీవితంలో రిస్కు తీసుకుని అయినా మంచి పన్లు చేయాలని... ఇదుగో... నా గురువు ఈ బాలీగాడు చెప్పాడు" అన్నాడు నవ్వుతూ. పేరు మార్చి పిలవటం సుభానీకి సరదా.

"నాదేముంది సార్. అంత డబ్బు ఖర్చుపెట్టినా జమునక్క వంటి మీద చెయ్యి వెయ్యని గొప్ప మనసు మీది..." అన్నాడు దణ్ణం పెడుతూ...

"గులాబీని నలిపి వాసన చూట్టంకంటే, పవిత్రంగా ఉంచడమే మంచిది కదా?"

"అలా ఎంతమంది ఆలోచిస్తారు? రూపాయితో పది రూపాయల స్వార్థాన్ని చూపిస్తారు" – మళ్లీ రైలుకూత వేసింది.

సుభానీ చేతి గడియారం చూసుకున్నాడు.

"ఇక వెళ్లిరా రా.. రైలు టైమయింది" అంటూ విజిల్ ఊదుతూ పచ్చదీపం పైకెత్తి పట్టుకున్నాడు. జమునకి దుఃఖం ఆగలేదు. బాలూ చేతుల్ని గట్టిగా పుచ్చుకుని ఏడ్చేసింది.

"బాలూ... నాతో వచ్చేసెయ్యి... నిన్ను చదివిస్తా"

బాలూ ఆమె మొహంలోకి చూశాడు.

"నిజంగానే... మనస్ఫూర్తిగా అంటున్నా.... నిన్ను నా తమ్ముడిలా చూసుకుంటా... రా! బాలూ..." ఏడుస్తూనే పిలుస్తోంది.

రైలు కదిలింది. సుభానీ పచ్చదీపం ఊపుతునే తన పెట్టెలోకి ఎక్కాడు. బాలూ కళ్లమ్మటే నీళ్లు వచ్చాయి. వాడికి తల్లి తెలీదు. ఏదో బంధం లాగుతున్నట్లు జమునకేసే చూస్తూ రైలు వెంట పరుగెత్తసాగాడు.

"రా!.... బాలూ....రా.... తొందరగా రైలెక్కు..." వేగం పెరుగుతున్న రైల్లోంచి గట్టిగా అరిచింది.

బాలూ ఇక ఆలోచించలేదు. గబగబ రైలెక్కేశాడు. రైలు భవిష్యత్తు వైపు ఉత్సాహంగా పరుగెత్తసాగింది.

## దృశ్యాదృశ్యం

**క**ష్టాల్లోనూ
సుఖం మిళితమై అదృశ్యంగా
ఓదార్చుచూ ఆహ్లాదాన్ని అందిస్తుంది

సుఖాల్లోనూ
నిర్లిప్త కష్టాలు మూగగా
లోలోన బాధిస్తుంటాయి మనిషిని

అంతులేని సుఖాలు
మనిషిని అల్లుకుపోయినపుడు
సుఖాల్లో కష్టాలు వెతుక్కోవటం
మనిషికి పరిపాటే
నిత్య సుఖాలు కూడా కష్టాల్లా వేధిస్తాయి, గోప్యంగా
సుఖం కష్టమై రూపాంతరం చెందే దశంటే
మనిషి తనను తాను
తెలియని మైకంలోపడి పోగొట్టుకోవటం
వెతుక్కోవటమూనూ!
నిత్య సుఖం ఎలా అనుభవించేది?
చీకటిలో కలిసిన పగలే
ఎక్కువగా సంతోషం పంచేది
నిత్య చీకటి, నిత్య పగలూ ఎవరు కోరేదీ?

తనను తాను పోగొట్టుకోవటం
తిరిగి, వెతుక్కుని
నిలబెట్టుకోవటం, ఇలా నిత్యం సాగటమే
మనిషికి కావలసింది!

– మహమ్మద్ ఖాన్